


భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



భద్రాచలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి బుధవారం అంతరాలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

15 కుంటల రిజిస్ట్రేషన్‌కు రూ.10వేలు

- రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన తల్లాడ తహసీల్దార్
- ఆర్‌ఐ, కంప్యూటర్ ఆపరేటర్ కూడా అరెస్టు



ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్, ఆర్‌ఐ, కంప్యూటర్ ఆపరేటర్

తల్లాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : 15 కుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు ఓ రైతు నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటూ ఖమ్మం జిల్లా తల్లాడ తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మాలోతు భాస్కర్, భూభారతి కంప్యూటర్ ఆపరేటర్ శివాజీ రాథోడ్ ఏసీబీకీ పట్టుబడ్డారు. బుధవారం సాయంత్రం ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో దాడులు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన ఓ రైతు మరో రైతు వద్ద కొనుగోలు చేసిన 15 కుంటల భూమిని భూభారతి ద్వారా తనకు రిజిస్ట్రేషన్ చేయాలని రెవెన్యూ అధికారులను సంప్రదించాడు. ఈ క్రమంలో అతడిని రూ.10 వేలు లంచం ఇవ్వాలని అధికారులు డిమాండ్ చేశారు. దాంతో సదరు రైతు ఏసీబీని ఆశ్రయించగా.. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పథకం ప్రకారం బుధవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో సదరు రైతు అధికారులకు రూ.10 వేలు లంచం ఇస్తుండగా ఆ అధికారులను పట్టుకున్నారు. ఈ తహసీల్దార్, ఆర్‌ఐ, కంప్యూటర్ ఆపరేటర్లను అరెస్టు చేశామని గురువారం ఉదయం న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు.

అంధుల పాఠశాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయండి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి 7

సంక్షేమం.. అభివృద్ధే ధ్యేయంగా..

పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో పాల్గొన్న ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రైతులు, కూలీలు భూమి, భుక్తి కోసం పోరాటాలు చేసి, నిజాం సాయుధ రజాకార్లను ఎదరించారని గుర్తుచేశారు.



ఖమ్మం పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించి.. ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతోంది
- అర్హులందరికీ అభయహస్తం గ్యారెంటీ పథకాలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ విద్యాలయాలు
- ప్రజాపాలన దినోత్సవంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ఖమ్మం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : నిజాం సంస్థానాన్ని సమైక్య భారత దేశంలో విలీనం చేసేందుకు ఎన్నో పోరాటాలు జరిగాయని, ఆ పోరాటాల్లో ఖమ్మం జిల్లాకు కూడా ప్రముఖమైన పాత్ర ఉందన్నారు. స్వామి రామానంద తీర్థ ఆధ్వర్యంలో సర్దార్ జమలాపురం కేశవరావు, కొమరం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ లాంటి అనేక మంది భాగస్వాములయ్యారని, రజాకార్లకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి ఈ ప్రాంతాన్ని ప్రజాస్వామ్య పాలనలో భాగస్వామ్యం చేశారని కీర్తించారు. మాహాకవి దాశరథి ఖమ్మం జిల్లా నుంచి ప్రయాణం సాగించారని, బొమ్మ కంటి సత్యనారాయణరావు, రామ్ చందర్ రావు, శీలం సిద్ధారెడ్డి, నల్లమల్ల గిరిప్రసాద్, మహ్మద్ రజబ్ అలీ, వెంగళరావు లాంటి అనేక మంది కీలకంగా వ్యవహరించారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని 48గంటల్లోనే అమలు చేయడం ప్రారంభించామన్నారు. ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభయహస్తం గ్యారెంటీ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా 2030 నాటికి రూ.లక్షా 98 వేల కోట్ల పెట్టుబడితో 20వేలమెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసి లక్షా 14 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందిరా మహిళ శక్తి పథకం కింద మహిళా సంఘాల ద్వారా రెండు మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇందిరా సౌర గిరిజల వికాసం కింద జిల్లాలో మొదటి విడత కింద 550 లబ్ధిదారులను ఎంపిక చేసి సోలార్ పంపు సెట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా 128 రెసిడెన్షియల్ పాఠశాలలో 20 వేల 502 మంది విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం వసతి కల్పిస్తున్నామన్నారు. జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాలలో 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో 200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో, ఇంగ్లిష్ మీడియం బోధనతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టామని అన్నారు. రేషన్ కార్డులను అర్హులైన పేద కుటుంబాల అందరికీ పంపిణీ చేస్తున్నామని, జిల్లాలో కొత్తగా 24,818 కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ చేశామన్నారు. వైద్యానికి ప్రాధాన్యమిస్తూ మధిర, సత్తుపల్లి పట్టణాలలో రూ.34 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ 100 పడకల ఆసుపత్రి, కల్లూరులో రూ.10.50కోట్లతో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పెనుబల్లిలో రూ.7.50కోట్లతో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను పూర్తి చేశామన్నారు. పాలేరు, సత్తుపల్లి పట్టణాల్లో రూ.25 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, వైరాలో రూ.37.50కోట్లతో 100 పడకల ఆస్పత్రి, ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో రూ.23.50కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆర్ అండ్ బీ ద్వారా 180 కోట్లతో మున్నేరు నదిపై తీగల వంతెన, 130 కోట్లతో వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. రూ.139 కోట్లతో పది రెండు వరుసల రహదారులను నాలుగు వరుసల రహదారులుగా విస్తరిస్తున్నామన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలో 1,38,790 ఎకరాల్లో కొత్త ఆయకట్టుకు సాగునీరు అందిస్తున్నామన్నారు. అంతకుముందు పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన దేశ భక్తి గేయాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను భట్టి సందర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, డీఆర్వో ఎ.పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షా రైనా, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్యం ప్రభుత్వ ధ్యేయం

- మూకమామిడి ఏకలవ్య పాఠశాలను దేశంలోనే మొదలుగా తీర్చిదిద్దాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదగాలి
- ములకలపల్లి, దమ్మపేట మండలాల పర్యటన

6



మూకమామిడి ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులతో సహపంక్తి భోజనం

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

- ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా హామీలు నెరవేరుస్తున్నాం
- మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణకు మెరుగైన సేవలందించాలి
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి
- 'స్వస్థ్ నారి.. సశక్త్ పరివార్' కార్యక్రమానికి హాజరు



సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యా, వైద్యరంగానికి పెద్దపీట వేసి ఆరోగ్యకరమైన కుటుంబాలు, సాధికారత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తిరుమలాయపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన స్వస్త్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమంలో ఆయన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ఏరియా ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ (మిగతా 6వ పేజీలో)

పోరాట యోధుల వారసత్వాన్ని కొనసాగిస్తాం

- కమ్యూనిస్టుల ప్రాణ త్యాగాలతోనే విలీనం
- చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు
- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు
- ఖమ్మం పాతబస్టాండ్ నుంచి జడ్పీ వరకు రెడ్ షర్టు వలంటీర్ల కవాతు
- జడ్పీలో విలీన దినోత్సవం

6



నగరంలో కవాతు చేస్తున్న సీపీఐ రెడ్ షర్టు వలంటీర్లు



సీతారాంఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బేబి, తమ్మినేని వీరభద్రం తదితరులు

భూ సంస్కరణలకు.. సాయుధ పోరాటమే స్ఫూర్తి

- కేరళ, పశ్చిమబెంగాల్, త్రిపురలో విజయవంతంగా అమలు చేశాం
- ఎర్రజెండా పోరాట ఫలితమే హైదరాబాద్ విలీనం
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి
- ఖమ్మంలో రైతాంగ పోరాటాల వారోత్సవాల ముగింపు సభ
- హాజరైన సీపీఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు తమ్మినేని, తదితరులు

ఖమ్మం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): దేశంలో భూసంస్కరణలకు స్ఫూర్తినిచ్చింది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమేనని, ఆ పోరాట స్ఫూర్తి ఫలితంగానే కమ్యూనిస్టు పాలిత కేరళ, పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో విజయవంతంగా భూసంస్కరణలు అమలుచేసి చూపించామని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల వారోత్సవాల (మిగతా 6వ పేజీలో)

మున్నేటిలో వసూళ్ల దందాపై భట్టి ఆగ్రహం!

చింతకాని, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్నేటి లంకలో గేటు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ల వారి నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న దందాపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల పర్యటనకు వచ్చిన ఆయన దందా గురించి అధికారులను ప్రశ్నించారు. దందాకు అడ్డుకట్ట వేయలేకపోవడ మేంటంటూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ దందా గురించి ఈనెల 12న 'ట్రాక్టరుకు రూ.2వేలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం తీవ్ర సంచలనం రేపగా.. దందా చేస్తున్న విషయంపై అధికారులను భట్టి విక్రమార్క మరింత చర్చకు దారి తీసింది.

ముమ్మాటికి విద్రోహ దినమే

- సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

6

ముమ్మాటికి విద్రోహ దినమే

» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిజాం నవాబ్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు నాయకత్వంలో తెలంగాణలో సాయుధ పోరాటం అనేక విజయాలను సాధించిందని, బాషా సంస్కతీలకు కోసం జరిగిన పోరాటం చివరకు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంగా మారిందని ఆ నాటి కేంద్ర ప్రభుత్వం నిజాం ప్రభుత్వంపై చర్యలు కాకుండా కమ్యూనిస్టు పార్టీలను హతమార్చేందుకు వేలాదిమంది వీరు ప్రాణాలను బలి తీసుకుందని అందుకే 17 సెప్టెంబరు 1948 ముమ్మాటికి విద్రోహ దినోత్సవమే అని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవుల అశోక్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ విద్రోహ దినోత్సవ సభలో పోటు రంగారావు ప్రసంగించారు. దీంతో తెలంగాణ ప్రాంతంలో నిరుపేదలైన ప్రజలు పది లక్షల ఎకరాలు పంచుకున్నారని తెలిపారు.

కమ్యూనిస్టు పోరాటాలతో 3వేల గ్రామాలను భూ స్వాముల పీడ నుంచి విముక్తి జరిగిందని చరిత్రను తెలిపారు. ఈ క్రమంలో నిజాం నవాబ్ పరిపాలించలేని కూలీపోయే స్థితిలో తెలంగాణ ప్రాంతం కమ్యూనిస్టుల చేతిలోకి వెళ్తుందని భావించిన నాటి కేంద్ర ప్రభుత్వం పటేల్, నెహ్రూ సైన్యాలతో మంతనాలు జరిపి సెప్టెంబరు 17న పోలీసు యాక్షన్ జరిపించారని పేర్కొన్నారు. నిజాం నవాబ్‌నుంచి కమ్యూనిస్టులను అణిచేందుకు కమ్యూనిస్టులకు ఊచకోత కోశారని అందుకే 1948 సెప్టెంబరు 17 విద్రోహ దినోత్సవమే అన్నారు. రామయ్య, సీవై పుల్లయ్య, ఝాన్సీ, ఆజాద్, ప్రతాపనేని శోభ, లెనిన్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం శిబిరాలు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిలో గురువారం నుంచి సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. 18న శారీరక దివ్యాంగులకు, 23 బధిరులకు, 25 అంధులకు, 30 మానసిక దివ్యాంగులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైకల్యనిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్టు సూపరింటెండెంట్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ ఉపాధ్యాయురాలు అందరికీ ఆదర్శం..

» కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయురాలు మంగేశ్వరి



తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న మంగేశ్వరి

నేలకొండపల్లి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): చెర్వుమధారం ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న పాలకుర్తి మంగేశ్వరి తన బాబు పాలకుర్తి వర్షిత్ 5వ తరగతి వరకు ప్రైవేటు బడుల్లోనే చదివాడు. ప్రైవేటు బడుల్లో విద్యార్థుల్లో పెరుగుతున్న వత్తిడి, పుస్తకాల బరువు ఎక్కువ గావటాన్ని గమనించిన ఆమె తన కుమారుని వత్తిడి నుంచి పారదోలాలని నిర్ణయించుకుని తాను పని చేస్తున్న చెర్వుమాధారం ప్రభుత్వ పాఠశాలలోనే బుధవారం చేర్పించింది. ఈసందర్భంగా మంగేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ బడులు ప్రైవేటు బడులకు ఏమాత్రం తీసిపోని రీతిలో ఉన్నాయన్నారు. దీంతో తన బాబును ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని నిర్ణయించుకున్నానని, తాను పని చేసే పాఠశాలలోనే చేర్పించానన్నారు.

ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయం

» మూకమామిడి ఏకలవ్య పాఠశాలను దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలి
» వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
» ములకలపల్లి, దమ్మపేట మండలాల్లో పర్యటన



గండుగులపల్లి ఏకలవ్యలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ములకలపల్లి / దమ్మపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి వైద్య సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. దేశవ్యాప్తంగా మహిళల ఆరోగ్యంకోసం ఏర్పాటు చేస్తున్న 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' మెగా వైద్యశిబిరాన్ని ఆయన ములకలపల్లి మండలం మంగపేట పీహెచ్‌సీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రజలు నాటు, భూత వైద్యులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యాలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన కోయ(గిరిజన)భాషలోనే మాట్లాడారు. ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్‌తో కలిసి పోస్టర్లను ఆవిష్కరించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం మూకమామిడి గ్రామంలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించిన తుమ్మల పాఠశాల, పరిసరాలు, తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం విద్యార్థులతో సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఏకలవ్య పాఠశాలు 23 ఉన్నాయని, అందులో ఉమ్మడి జిల్లాలోనే 8, అశ్వారావుపేట నియోజకవర్గంలో రెండు ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయని, ఈ ప్రాంత యువత భవిష్యత్‌కోసం తామంతా విద్య, వైద్యంపట్ల చిత్తశుద్ధితో వ్యవహరిస్తుండటంవల్లనే సాధ్యమవుతుందన్నారు. మూకమామిడి ఏకలవ్య పాఠశాలను దేశంలోనే మోడల్ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అందుకు తాను కూడా తన వంతు కృషి చేస్తానన్నారు. ఆ తర్వాత విద్యార్థులతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ మూకమామిడి, గండుగులపల్లిలో రెండు ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేయించిన ఘనత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకే దక్కిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు, పనులు మంజూరీలో ఆయన సహకారం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి, స్థానిక వైద్యాధికారులు, కాంగ్రెస్ నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం దమ్మపేట మండలం గుండుగులపల్లి చేరుకున్న తుమ్మల గ్రామంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో రూ8.65 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన తుమ్మల ఇక్కడే చదివే విద్యార్థులు దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. గిరిజన ప్రాంత విద్యార్థులకు ఉన్నత లక్ష్యంతో చదువును అందించేందుకు ఏకలవ్య పాఠశాలను రాష్ట్రంలో తొలిసారి ఇక్కడే ప్రారంభించామన్నారు. ఖనిజ సంపదకు నిలయమైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దేశంలోని ఎక్కడా లేని విధంగా కొత్తగూడెంలో ఎర్త్ యూనివర్సిటిని ఏర్పాటు చేసి.. దానికి మన్మోహన్‌సింగ్ యూనివర్సిటీగా పేరు పెట్టుకున్నామన్నారు. విద్యార్థుల కోసం తాగునీరు, ల్యాబ్ సౌకర్యంతో పాటు గ్రామస్థులకు కమ్యూనిటీ భవనాన్ని నిర్మించిన అడ్వాంటా సంస్థ యాజమాన్యాన్ని తుమ్మల అభినందించారు. అంతకు ముందు మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే, అధికారులపై పాఠశాల విద్యార్థులు పూలు చల్లి.. బ్యాండ్ వాయిస్తూ ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ తన నియోజక వర్గంలో ఉన్నతమైన విద్యను అందించే గండుగులపల్లి, మూకమామిడి గ్రామాలలో ఏకలవ్య పాఠశాలలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి వల్లే ఏర్పాటయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రోహిత్ రాజ్, జిల్లా అధికారులు జయలక్ష్మి, విద్యాచందన, నాగలక్ష్మి, రఘుబాబు, బాబు రావు, దమ్మపేట సొసైటి చైర్‌మెన్ ఎల్లిన రాఘవరావు, ఏఎంసీ చైర్ పర్సన్ వాసం రాణి, కొయ్యల అచ్యుతరావు, మాజీ జడ్పిటీసి పైడి వెంకటేశ్వరరావు, కేవి సత్యనారాయణ, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, మడకం రాజేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోరాట యోధుల వారసత్వాన్ని కొనసాగిస్తాం

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టుల ప్రాణ త్యాగాలతోనే తెలంగాణ ప్రజాస్వామ్యయుతంగా 17 సెప్టెంబరు 1948న విలీనం జరిగిందని, చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షేమించదని తెలంగాణ సాయుధ పోరాట స్పూర్తిని కొనసాగిస్తామని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. బుధవారం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో తెలంగాణ విలీన దినోత్సవం జరిపారు. అంతకు ముందు ఖమ్మం నగరంలో పాత బస్టాండ్ సెంటర్ నుంచి జడ్పీ వరకు జనసేవాదళ్ రెడ్‌షర్టు వాలంటీర్లతో కవాత్ చేపట్టారు. జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా సమితి కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంపై సరైన అవగాహన లేని వారు ఇది మతపరమైన పోరాటంగా చిత్రీకరిస్తున్నారని, నిజాంకు వ్యతిరేకంగా ప్రాణాలు అర్పించిన వారిలో ముస్లింలు కూడా ఉన్నారని తెలిపారు. కార్పొరేటర్ బీజీ క్లైమెట్, జమ్ముల జితేందర్‌రెడ్డి, మహ్మద్ మౌలానా, యర్రా బాబు, ఎస్‌కే జా నిమియా, ఏపూరి లతాదేవి, గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలామ్, అజ్మీరా రామ్మూర్తి ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జాతీయ సమితి సభ్యుడు బాగం, నాయకులు

ఖమ్మం జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ జట్లు సిద్ధం



ఎంపికైన బాలుర జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ బాలుర, బాలికల కబడ్డీ పోటీలలో పాల్గొనే జిల్లా కబడ్డీ జట్లను బుధవారం నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 293 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ క్రిష్టఫర్‌బాబు ప్రకటించారు. ఎంపికలను వ్యాయామ ఉపాధ్యాయులు నాగప్రసాద్, సుధాకర్, లాలయ్య, సత్యనారాయణ, చంద్రశేఖర్, శోభన్, శివజ్యోతి, శ్రీను, శివ, ప్రవీణ్ తదితరులు సమీక్షించారు.

మా నిధులు, రిజర్వేషన్లు మాకే ఇవ్వాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం లో లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించి మా నిధులు, నియామకాలు, రిజర్వేషన్లు మాకే కలిపించాలని రాష్ట్ర ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ చుంచు రామకృష్ణ తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 28న జరిగే ఛలో భద్రాచలం భారీ బహిరంగసభకు ఆదివాసీ ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.. ఈసమవేశంలో మేట్ల పాపయ్యదొర, కల్లి వీరమల్లు, కొమరం ప్రసాదరావు, ముర్ల రమేస్‌రెడ్డి, జగ్గ పుల్లయ్య, దబ్బకట్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రూడ్రైవర్ నెయిల్ మింగిన ఎనిమిదేళ్ల బాలుడు

శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడిన భద్రాది వైద్యులు





శస్త్రచికిత్స అనంతరం బాలుడితో వైద్యులు, సిబ్బంది, ఎక్స్‌రే

భద్రాచలం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ ఎనిమిదేళ్ల బాలుడు ప్రమాదుశాత్తు స్క్రూడ్రైవర్ నెయిల్‌ను మింగి, ప్రాణాలమీదుకు తెచ్చుకున్నాడు. చివరకు భద్రాచలం ప్రభుత్వ వైద్యులు అతడికి శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలివీ.. ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం చోడవరం గ్రామానికి చెందిన తుమ్మల సునీల్, రాజేశ్వరి దంపతుల ఎనిదేళ్ల కుమారుడు తుమ్మల గౌతమ్ మూడు రోజుల క్రితం ఆడుకుంటూ 6 సెంటీమీటర్ల పొడవున్న స్క్రూడ్రైవర్ నెయిల్‌ను మింగాడు. ఆ తర్వాత ఆ కడుపులో నొప్పి వస్తోందని తల్లిదండ్రులకు చెప్పాడు. ఈ క్రమంలో తాను స్క్రూడ్రైవర్ నెయిల్‌ను మింగానని చెప్పినా వారు నమ్మలేదని తెలుస్తోంది. అయితే కుమారుడికి రెండురోజులైనా కడపు నొప్పి తగ్గకపోవడంతో బుధవారం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తీసుకువచ్చారు. దీంతో బాలుడిని పరీక్షించిన డాక్టర్ గౌతమ్ చిన్నారి మాటలను పరిగణలోకి తీసుకున్నారు. ఎక్స్‌రేతీయగా బాలుడి పేగులో స్క్రూడ్రైవర్ నెయిల్ ఇరుక్కునట్లు గుర్తించారు. దీంతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరిండెంటెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ నేతృత్వంలో వైద్యులు, సిబ్బంది బుధవారం రాత్రి శస్త్రచికిత్స చేసి, ఆరు సెంటీమీటర్ల స్క్రూడ్రైవర్ నెయిల్‌ను బయటకు తీశారు. దాంతో ఆ బాలుడు ప్రాణాపాయం నుంచి బయటపడగా.. కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా బాలుడిని కాపాడిన ఏరియా వైద్యశాల వైద్యులను పలువురు అభినందించారు.

ఇసుక లారీల అడ్డగింత



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ నాగబాబు

మణుగూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీల వల్ల ఇబ్బందులు పడుతున్నామని ఆరోపిస్తూ కమలాపురం గ్రామస్థులు బుధవారం ఆ లారీలను అడ్డుకున్నారు. దీంతో లారీలు భారీ సంఖ్యలో నిలిచిపోయాయి. దీంతో మణుగూరు సీఐ పాటి నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. టీఎస్ఎండీసీ అధికారులు, పోలీసులతో ప్రజలు వాగ్వాదానికి దిగారు. లారీల రాకపోకల వల్ల ఇతర వాహనాలు, స్కూల్ బస్సులు గ్రామంలోకి రాలేని పరిస్థితులు నెలకొన్నాయని, కరెంట్ పోల్స్‌ను కూడా లారీలు ఢీకొట్టడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. ఆ లారీల వలన ప్రాణాపాయ పరిస్థితులను నెలకొల్పుతున్నాయని ఆరోపించారు. దాదాపు మూడు గంటల పాటు ఆందోళన సాగించిన తర్వాత స్థానికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసుకుని ఇసుక నిర్వాహకులు తమ లారీల రాకపోకలు సాగించాలని డిమాండ్ చేశారు. చివరికి పోలీసుల జోక్యంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం విద్యావైద్యానికిపెద్దపీట వేస్తోందని, ఈరెండు రంగాలకు నిధులు వెచ్చించి పేదవాడి ప్రభుత్వం ఆడబిడ్డలకు అన్నివిధాల అండదండలు అందిస్తున్నామన్నారు. తిరుమలాయపాలెం ఏరియా ఆస్పత్రిని 30 పడకలనుంచి 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, ఆస్పతికి అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని లూటీ చేశారని ఆరోపించారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఎన్ని కోట్లయినా ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వైద్యులు భగవంతుడి రూపమని, రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలన్నారు. మహిళలు పిల్లల ఆరోగ్య రక్షణకు చేపట్టిన స్వస్తనారి సశక్త్ పరివార కార్యక్రమం 15రోజులు కాకుండా చిత్తశుద్ధితో చేపట్టాలన్నారు. అనంతరం 21మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులను అందించారు. తిరుమలాయపాలెం నుంచి ములకలపల్లి వరకు రూ.కోటి 50లక్షలతో చేపడుతున్న హైలెవల్ బ్రిడ్జి అప్రోచ్ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందుఏరియా ఆసుపత్రిని మంత్రి తనిఖీ చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, డిప్యూటీడీఎంహెచ్‌వో చందునాయక్, వైద్యాధికారులు కృపాఉషశ్రీ, బొల్లికొండ శ్రీనివాసరావు, వైదేహి, నాగేశ్వరరావు, అమర్‌సింగ్, జేడీఏ పుల్లయ్య, పీఆర్ ఎస్ఈ వెంకటరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుంబూరు దయాకరరెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేశ్‌రడ్డి, ఆత్మకమిటీచైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, మాజీజడ్పీటీసీ బెల్లం శ్రీను తదితరలున్నారు. అనంతరం మంలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత సిరిగద్దె ఉపేందర్ తల్లిదండ్రులు రాజమ్మ, ముత్తయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి వారి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామసహాయం నరేశ్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, బోడ మంగిలాల్, తదితరులు పాల్గొన్నారు.



ఏరియా ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

భూ సంస్కరణలకు..

సాయుధ పోరాటమే స్ఫూర్తి

(5వ పేజీ తరువాయి)



ప్రసంగిస్తున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, జాతీయ కార్యవర్గ సభ్యుడు తమ్మినేని, సభకు హాజరైన జనం

ముగింపు సభ జరిగింది. ఈసభకు హాజరైన ఎంఏ బేబీ ప్రసంగిస్తూ తెలంగాణలో ఎందరో నాయకులు సాయుధ రైతాంగ పోరాటంలో అమరులయ్యారని, భూమి, భుక్తికోసం రైతులు, శ్రామికులు, మహిళలు సంఘటితంగా కదలి నిజాం పాలనకు వ్యతిరేక పోరాటంతో పాటు భూసమస్యలు పరిష్కారం కోసం ఉద్యమించారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాటాన్ని అణిచివేసేందుకు అనేక హింసలకు పాల్పడిందని, అయినా మల్లు స్వరాజ్యం లాంటి మహిళ నేతలు ఉద్యమంలో ముందడుగు వేశారే తప్ప వెనకడుగు వేయలేదన్నారు. ఎర్రజెండా నీడలో రైతులు, మహిళలు, కార్మికులు, అన్ని మతాల ప్రజలు.. తెలంగాణ దేశంలో విలీనం కోసం ఉద్యమించారని, కులమత రహితంగా పోరాడారని ఫలితంగానే హైదరాబాద్ భారతదేశంలో విలీనమైందన్నారు. ఆనాడు ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఎక్కడా లేవని, ఇప్పుడు దేశంలో హిందూరాజ్యాన్ని స్థాపించేందుకు ఆర్ఎస్ఎస్ ప్రోత్సహంతో బీజేపీ కుట్రలు చేస్తోందని, ప్రధాని మోదీ, అమిత్‌షా మతోన్మాద చర్యలు ప్రోత్సహిస్తున్నారన్నారు. దేశంలో హిందూయేతరులు ద్వితీయశ్రేణి పౌరులుగా జీవించాలన్నదే వారి విధానమన్నారు. సీతారాం ఏచూరి శాస్త్రీయపరమైన సోషలిజానికి తిరుగులేదని చెప్పారని గుర్తుచేశారు. సోషలిజం కోసం సీతారాం ఏచూరి చేసిన కృషిని కొనియాడారు. గాంధీ, నెహ్రూ లాంటి నాయకులు సర్వమతాలను సంఘటితం చేస్తూ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. మతోన్మాదశక్తులకు వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలకు నిరసనగా సీపీఎం తో పాటు అన్ని లౌకిక పార్టీలతో సంఘటిత ఉద్యమం సాగించాలని, ఎర్రజెండా ఉనికిని పెంచే విధంగా ఐక్యపోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జాతీయ కార్యవర్గసభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై కొన్నిపార్టీలు వక్రీకరణలు చేస్తున్నాయని, నాటి త్యాగాలను పోరాటాలను వక్రీకరించి అవస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. విమోచన, విలీనం, విద్రోహం పేరుతో రాజకీయపార్టీలు తెలంగాణ పోరాట ఉద్యమాన్ని ఇష్టానుసారంగా అభివర్ణిస్తున్నారని, కొన్నిపార్టీలు హిందూముస్లింల మధ్య పోరాటంగా పేర్కొంటున్నాయని ఆరోపించారు. వాస్తవానికి నాటి పోరాటం, స్ఫూర్తి, చైతన్యం తెలంగాణ ప్రజల బానిస విముక్తితో పాటు రైతాంగ పేదల సమస్యల పరిష్కారానికి సాగిన మహోన్నత ఉద్యమమని తెలిపారు. సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పోతినేని సుదర్శన్, భారతి, బండి రమేష్, బుగ్గవీటి సరళ, వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఐలూ జాతీయ నాయకుడు కొల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం మహిళల పడిగాపులు



బ్యాంకు వద్ద గుమిగూడిన మహిళలు

దుమ్ముగూడెం సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట మహిళలు పెద్దసంఖ్యలో డ్వాక్రా రుణాల కోసం బుధవారం పడిగాపులు కాశారు. నెలల తరబడి బ్యాంకు చుట్టూ తిరిగి విసిగివేసారిన మహిళలు రుణాలు ఎప్పుడిస్తారని మేనేజర్‌ను నిలదీశారు. తీసుకున్న రుణాలు చెల్లించి నాలుగు నెలలు కావస్తుండగా, తిరిగి ఇవ్వడానికి రోజుల తరబడి బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటున్నారని ప్రశ్నించారు. నలభై సంఘాలకు చెందిన మహిళలకు సుమారు రూ.కోటి వరకు రుణాలు ఇవ్వాల్సి ఉండగా, సిగ్నల్ సరిగ్గా లేదని, ఫీల్డ్ ఆఫీసర్ రాలేదనే సాకుతో డ్వాక్రా సంఘాల సభ్యులను నెలల తరబడి ముప్పుతిప్పలు పెడుతున్నారు బ్యాంకు సిబ్బంది. ఈ మేరకు మేనేజర్‌ను వివరణ కోరగా, తాను వారం క్రితమే కొత్తగా జాయిన్ అయ్యానని, ఫీల్డ్ ఆఫీసర్ కూడా కొత్తగా వచ్చారని తెలిపారు. ఈనెల 17నుంచి రోజుకు రెండు గ్రూపులకు రుణాలిస్తామని తెలిపారు.

గేటురేలకాయలపల్లి

పోడు భూమిలో పత్తి ధ్వంసం

ఫారెస్టు అధికారులే అంటూ పోలీసులను ఆశ్రయించిన రైతు



ధ్వంసమైన చేసిన పత్తి చేను

కారేపల్లి సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గేటురేల కాయలపల్లి సమీపంలో ధర్మసోత్ సూర్యం అనే రైతులకు చెందిన పోడుభూమిలో సాగుచేసిన రెండు ఎకరాల్లో పత్తి పంటను మంగళవారం అర్ధారాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని రైతు సూర్యం బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన పత్తిపంటను కావాలనే ఫారెస్టు అధికారులే ధ్వంసం చేశారనే అనుమానం వ్యక్తం చేశాడు. ఇదే విషయంపై పోలీసులు ఇల్లెందు, కారేపల్లి రేంజీ పరిధిలోని ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. అయితే అటువైపు ఫారెస్టు అధికారులు కానీ, సిబ్బంది ఎవరూ రాలేదనే సమాధానం తెల్పి చెప్పారు. ధ్వంసం అయిన పత్తి పంటను గిరిజన సంఘం మండల అధ్యక్షుడు అజ్మీర శోభన్‌బాబు, ధారవత్ రవి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యం కష్టపడి పత్తి పంటసాగు చేస్తున్న తరుణంలో పంటను ధ్వంసం చేయడం పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. పంటను ధ్వంసం చేసినవారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సూర్యం ఫిర్యాదు మేరకు ఎవరిపై ఏలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

శివాలయ కమిటీ చైర్మన్‌గా యార్లగడ్డ

బోనకల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): బోనకల్ శివాలయ కమిటీ చైర్మన్‌గా యార్లగడ్డ శ్రీనివాసరావు బుధవారం శివాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా బాణోతు జ్వాల, వరికూటి వెంకటి, పాసంగులపాటి అనిల్, మోదుగు మరియమ్మ, ఆచార్య పిప్పర్లపాటి వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, గుండపనేని సుధాకర్‌రావు, పోటు వెంకటేశ్వర్లు, బండి వెంకటేశ్వర్లు, బీపీ నాయక్, చేబ్రోలు వెంకటేశ్వర్లు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, యార్లగడ్డ కృష్ణయ్య, మోర్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.



కోనేటి నుంచి నీటిని తీసుకొస్తున్న ఆలయ అర్చకులు

పదేళ్ల అనంతరం నృసింహునికి

కోనేటి నీటితో అభిషేకం

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం(గుట్ట)పై రెండు కొండల మధ్య ఉన్న పురాతన కోనేరును గత రెండు రోజులుగా శుద్ధి చేసి బుధవారం కోనేటి నీటితో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. గత పదేళ్లుగా కోనేరు నీరు స్వామివారి అభిషేకానికి వాడటం లేదని, కోనేరు మొత్తం చెత్తా చెదారంతో నిండిపోవడంతో అందుబాటులోకి రాలేదని ఆలయ అర్చకులు తెలిపారు. ఇక ప్రతి రోజు వేకువజామున స్వామి అభిషేకానికి గుట్టపైనున్న కోనేటి నీటితోనే అభిషేకాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. కోనేరు నీటికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలతో ఆలయ సాంప్రదాయాలు పాటిస్తూ బుధవారం ఉదయం ఆలయ అర్చకులు నరహరి నర్సింహాచార్యులు, రామకృష్ణాచార్యులు, శ్రీనివాసచార్యులు, రాధాకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో జలబిందెలను తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. స్వామి వారి కోనేరు అందుబాటులోకి రావటంతో ఆలయ భక్త బృందం, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేసి, ఆలయ ఈవో జగన్‌మోహన్‌రావుకు, అర్చకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మెట్రో రైలులో సెక్యూరిటీ గార్డుగా

గన్నవరం ట్రాన్స్‌జెండర్



కోరే రుచిత

వైరా, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైరా మండలం గన్నవరం గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ కోరే రుచిత హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌లో సెక్యూరిటీ గార్డుగా ఉద్యోగం సాధించింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతులమీదుగా రుచిత సెక్యూరిటీ గార్డు నియామక పత్రాన్ని అందుకుంది. గన్నవరం గ్రామానికి చెందిన రుచిత 2019కు ముందు అబ్బాయిగానే ఉండగా.. ఆ సమయంలో డిగ్రీ చదువును మధ్యలోనే ఆపేసి వరంగల్ వెళ్లి అక్కడి ట్రాన్స్‌జెండర్లతో పరిచయాలు పెంచుకున్నాడు. ఆ తర్వాత భిక్షాటన చేస్తూ జీవనోపాధితోపాటు కొంత ఆదాయాన్ని సమకూర్చుకున్నాడు. అనంతరం హైదరాబాద్ వెళ్లి లింగమార్పిడి చేయించుకొని ట్రాన్స్‌జెండర్‌గా మారి రుచితగా వచ్చాడు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంతో బతికే విధంగా ప్రోత్సహిస్తూ వివిధ సంస్థల్లో ఉద్యోగ నియామకాల్లో అవకాశాలు కల్పించింది. దాంతో హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌లో సెక్యూరిటీ గార్డులుగా 20మంది ట్రాన్స్‌జెండర్లు నియమితులయ్యారు. ఆ అవకాశం దక్కించుకున్న వారిలో రుచిత ఒకరు. లింగమార్పిడి జరిగి ట్రాన్స్‌జెండర్‌గా మారిన తర్వాత రుచిత రెండేళ్ల నుంచి గన్నవరంలోని తమ కుటుంబసభ్యులతో సత్సంబంధాలు కొనసాగిస్తోంది.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా..

- స్వస్త్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్
- ప్రారంభించిన ఖమ్మం డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి



కార్యక్రమాన్ని ప్రారంభించి వైద్యపరీక్షలను నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి తదితరులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వస్త్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి అన్నారు. బుధవారం నుంచి అక్టోబరు 2వరకు ఈ కార్యక్రమంలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి మహిళలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఈ కార్యక్రమాన్ని లాంచనంగా ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 26 పీహెచ్‌సీలు, 4 యూపీహెచ్‌సీలు, పల్లె, బస్తీ దవాఖానాల్లో రోజు ఒక స్పెషలిస్టు వైద్యులతో పరీక్షలు నిర్వహించి వైద్యం చేయనున్నట్టు తెలిపారు. దీని కోసం అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ వైద్య శిబిరాల్లో మహిళల అనారోగ్య సమస్యలను గుర్తించి వారికి చికిత్సలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

జిల్లాలోని మహిళలను చైతన్యపరిచి వైద్య పరీక్షలు నిర్వహించుకునేలా ఆయా ఆరోగ్య కేంద్రాల ఆశావర్కర్లు అవగాహన కల్పించాలన్నారు. శిబిరాల్లో మహిళలకు వైద్యులు పరీక్షలు చేయటమే కాకుండా ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయనున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నరేందర్, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఆర్ఎంవోలు డాక్టర్ బి రాంబాబు, డాక్టర్ బి.కిరణ్‌కుమార్, డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, డాక్టర్ బాబూరత్నాకర్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ రాధిక, నర్సింగ్ సూపరింటెండెంట్ శాంతికుమారితోపాటు వివిధ విభాగాల ప్రత్యేక వైద్యాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

అంధుల పాఠశాల ఏర్పాటుకు

ప్రణాళికలు సిద్ధం చేయండి

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంధుల పాఠశాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అంధులకు స్కూల్ ఏర్పాటుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి జడ్పీ సీఈవో, విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో అంధులకు పాఠశాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ పాఠశాలలో అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. అంధుల భద్రత దృష్టిలో ఉంచుకొని పాఠశాల నిర్మాణం జరగాలన్నారు. పాఠశాలల్లో అంధులు నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. మలకపేట అంధుల పాఠశాల, దేవనార్ పాఠశాలను సందర్శించి ఈ జిల్లాలో చిన్న స్థాయిలో అంధుల పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, సీఎంవో ప్రవీణ్, స్పెషల్ ఎడ్యుకేటర్ రాకేష్, పంచాయతీరాజ్ ఏఈ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అగ్రరాజ్యంలో ప్రవాస భారతీయుల

అపూర్వ కలయిక

క్యాసినోలో కేయూ గోల్డెన్ జూబ్లీ వేడుకలు



అమెరికాలో జరిగిన వేడుకలో పాల్గొన్న ప్రవాస భారతీయులు

తల్లాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉరుకుల, పరుగుల మధ్య బిజీగా జీవనం గడిపే ప్రవాస భారతీయులు రెండురోజులపాటు మిత్రులతో, గురువులతో కలిసి గత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ సందడి చేసిన ఘటన అగ్రరాజ్యమైన అమెరికాలో జరిగింది. కాకతీయ యూనివర్శిటీ ప్రస్థానం 50ఏళ్ల మైలురాయికి చేరుకున్న సందర్భంగా అమెరికాలో ప్రవాస భారతీయులు ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయం కళాశాల ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో 1976-2025 వారు అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులను పూర్తిచేసి అమెరికాలో వివిధ రంగాల్లో స్థిరపడిన సుమారు 335మంది కలిసి అట్లాంటిక్ సిటీలోని క్యాసినోలో గల బోగట్ట హోటల్‌లో యూసీపీఎస్ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకల ఏర్పాట్లను తల్లాడ మండల కుర్నవల్లి గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు యన్నం శ్రీనివాసరెడ్డితోపాటు డాక్టర్ సాంబారెడ్డి, పరుచూరి శ్రీనివాస్, తమర విజయ్ పర్యవేక్షించారు. ముందుగా భారత, అమెరికా జాతీయ గీతాలను గడ్డం ప్రమీల, పారుపల్లి నేహ ఆలపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ ఉపకులపతి ఆచార దర్శన ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం హాజరై తమ అనుభవాలను ప్రవాస భారతీయులతో పంచుకున్నారు. ఈ వేడుకలో అమెరికాలో స్థిరపడిన భారతీయులతో పాటు కెనడ, యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి ఆనాటి కేయూ విద్యార్థులు పాల్గొన్నారు.



జూలూరుపాడులోని సొసైటీ వద్ద రైతుల క్యూ

యూరియా కష్టాలు తీరేదెన్నడో?

జూలూరుపాడు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా వెతలు తప్పడంలేదు. మండలంలోని కొన్ని గ్రామాలకు చెందిన రైతులు యూరియాను పొందేందుకు జూలూరుపాడులోని సొసైటీ కార్యాలయం వద్దకు అర్ధరాత్రి చేరుకుని పడిగాపులు కాస్తున్నారు.అయినప్పటికీ యూరియా దొరకకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. బుధవారం తెల్లవారుజామున 4గంటలకే 150మంది రైతులు సొసైటీ వద్దకు చేరుకుని క్యూలైనులో పడిగాపులు కాశారు. వ్యవసాయ పను లు మానుకుని వచ్చినప్పటికీ యూరియా దొరికే పరిస్థితి కనిపించడం లేద ని రైతులు వాపోయారు. 220 బస్తాలను రైతులకు పంపిణీ చేసినట్టు సీఈవో రమణారెడ్డి తెలిపారు.

చల్ చల్ గుర్రం..

పెట్రోల్ భారాన్ని గుర్రం స్వారీతో దూరం చేస్తున్న రైతు



గుర్రంపై పొలానికి వెళ్తున్న రైతు ఖాదర్

చింతకాని మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు షేక్ ఖాదర్ తనకున్న ఐదెకరాల పొలంతో పాటు కొదుమూరు, నేరడ గ్రామాల్లో మరో 25 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. ఇంటి నుంచి పొలాలు దూరంగా ఉండటంతో ద్విచక్ర వాహనంపై వెళ్లేవాడు. పెట్రోల్ ధరల భారంతో పాటు పొలాలకు వెళ్లే డొంక దారికావడంతో తన మిత్రుడి వద్ద ఉన్న గుర్రాన్ని తెచ్చుకుని రెండు నెలల పాటు మచ్చిక చేసుకున్నాడు. ఇప్పుడు ఎంచక్కా పొలానికి ఇతర పనులకు ఉపయోగిస్తున్నాడు.

- ఆంధ్రజ్యోతి, చింతకాని

చంద్రుగొండలో ఇందిరమ్మ ఇళ్లకు

డబుల్ చెల్లింపులు

- రికవరీ చేయాలని గృహనిర్మాణ శాఖ ఆదేశాలు

చంద్రుగొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండలంలోని పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు డబుల్ బిల్లులు చెల్లింపులు జరిగిన విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని పలు గ్రామాలకు కొంతమంది లబ్ధిదారులకు నిబంధనల మేరకు రావాల్సిన రూ.లక్ష చొప్పున 11న వారి ఖాతాల్లో జమ అయింది. కాగా అదే లబ్ధిదారులకు తిరిగి 15 మరో రూ.లక్ష చొప్పున వారి ఖాతాలకు జమ అయ్యాయి. ఇది గమనించిన గృహనిర్మాణ శాఖ అధికారులు తక్షణమే 12మంది లబ్ధిదారుల నుంచి రికవరీ చేసి ప్రభుత్వ ఖాతాల్లో జమచేయాలని స్థానిక ఏఈ, ఎంపీడీవోను ఆదేశించారు. టెక్నికల్ సమస్య కారణంగా తప్పిదం జరిగి ఉండవచ్చని స్థానిక అధికారులు తెలిపారు.

స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్

బకాయిలను వెంటనే చెల్లించాలి

వైరా, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్కాలర్‌షిప్, ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి శశికిరణ్ అధ్యక్షతన బుధవారం జరిగిన పీడీఎస్‌యూ 23వ మండలమహాసభలో వెంకటేష్ ప్రసంగించారు. రాష్ట్రంలో రూ.8200కోట్ల బకాయిలున్నాయని తెలిపారు. దీంతో పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్రీను, నిఖిల్, రంజిత్, అశోక్, శ్రీలత, భానుజాస్మిత పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో

ఎలక్ట్రీషియన్‌కు గాయాలు



గాయపడిన కార్తీక్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రయివేట్ ఎలక్ట్రిషన్ విద్యుత్‌షాక్ గురవ్వగా గాయాలైన సంఘటన సత్తుపల్లి మండలంలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని గంగారం, పాకలగూడెం సబ్‌స్టేషన్ల పరిధిలోని పాకలగూడెం రోడ్డులోని (ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన కోనాయిగూడెం ఫీడర్) విద్యుత్ పోల్‌వద్ద లైన్‌మెన్ లక్ష్మీనారాయణ, అతని సపోర్టింగ్‌గా వెళ్లిన ప్రయివేట్ ఎలక్ట్రిషన్ బీ.కార్తీక్ విద్యుత్ షాక్‌కు గురవ్వగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన ఖమ్మంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించామని, ప్రస్తుతం క్షతగాత్రుడు కార్తీక్ ఆరోగ్యం మెరుగ్గానే ఉందని రూరల్ ఏఈ కావ్య తెలిపారు.

గుండెపోటుతో

కాంగ్రెస్ కార్యకర్త మృతి

కారేపల్లి సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాగ్యనగర్‌తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త గుగులోత్ వెంకట్రామ్ (52) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే లావుడియ రాములు నాయక్‌లు భౌతికాయాన్ని సందర్శించి నివాళ్ళులర్పించారు.

పోడు నరికిన వ్యక్తిపై కేసు

- కొత్తగా పోడు నరికితే కఠిన చర్యలు : ఎఫ్ డీవో కోటేశ్వరరావు

జూలూరుపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలోని ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలను ఓ వ్యక్తి తొలగించి కొత్తగా పోడు సాగు చేసిన సంఘటనలో అతనిపై కేసును నమోదు చేసినట్లు కొత్తగూడెం ఎఫ్‌డీఓ యు.కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన జూలూరుపాడులోని రేంజ్ కార్యలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వివరాలను వెల్లడించారు. పాపకొల్లు పంచాయతీ భీమ్లాతండా గ్రామానికి చెందిన నునావత్ రమేష్‌కు రాజారావుపేట అటవీ ప్రాంతంలో 5 ఎకరాలకు సంబంధించి ఆర్వోఎఫ్ఆర్ పట్టాను 2006లో ప్రభుత్వం మంజూరీ చేయటంతో ఆ భూమిని సాగు చేసుకుంటున్నాడు. అతని భూమి సమీపంలోని అటవీ భూమిలో తమ శాఖ ఆధ్వర్యంలో ప్లాంటేషన్‌లో భాగంగా మారుజాతి మొక్కలను నాటామని, సదరు వ్యక్తి కొన్నిరోజుల క్రితం రూ. 23వేల విలువ చేసే 120 మొక్కలను తొలగించి కొత్తగా ఎకరం పోడు భూమిని అక్రమించాడని తెలిపారు. తమ సిబ్బంది గుర్తించడంతో రమేష్‌పై కేసు నమోదు చేశామన్నారు. కొత్తగా ఎవరైన వ్యక్తులు పోడును నరికితే పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్‌డీవో కోటేశ్వరరావు

అడవి పంది మాంసం స్వాధీనం

మండలంలోని పాపకొల్లు-బి అటవీ ప్రాంతంలో ఎలకలొడ్డు గ్రామంలో నివసిస్తున్న గొత్తికోయ వ్యక్తి కోటసీ రామ అనే వ్యక్తి అడవి పందిని వేటాడి మాంసాన్ని విక్రయిస్తున్నాడు. బీట్ ఆఫీసర్ విజయలక్ష్మికి సమాచారం అందడంతో మంగళవారం రాత్రి సిబ్బందితో కలసి ఎలకలొడ్డు గ్రామంలోని గొత్తికోయ వ్యక్తి రామ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. అప్పటికే సుమారు కేజీన్నర మాంసాన్ని సదరు వ్యక్తి పొయ్యి మీద వండుతున్నాడు. సిబ్బంది ఆ మాంసాన్ని, జంతువుకు సంబంధించిన వెంట్రుకలను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు.

అడవి పందిని వేటాడటంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్‌డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ప్రసాదరావు, ఎఫ్ఎస్ఓ మల్లయ్య, ఎఫ్‌బీవోలు రహీం, విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాపలాదారుడి మృతి

దుమ్ముగూడెం సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం ఆవాస ప్రాంతం వర్కుషాపు వద్ద చేపల చెరువుకు కాపలా కాస్తున్న వృద్ధుడు బుధవారం అదే చెరువులో శవమై తేలాడు. గోవిందాపురానికి చెందిన పొడియం మూర్తి(66) కొన్నేళ్ల నుంచి చేపల చెరువుకు కాపలా కూలీగా ఉంటూ చెరువు గట్టు పక్కనే ఒక రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కాగా మూర్తి ఈనెల 16న మధ్యాహ్నం నుంచి కనపడకుండా పోయాడు. ఈనెల 17న చెరువు ఒడ్డున మృతదేహం తేలడంతో పోలీసుల ఆధ్వర్యంలో బైటకు తీశారు. చెరువు గట్టుపై నడుస్తూ ప్రమాదవశాత్తూ కాలుజారి పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఎస్‌ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే రోజు రెండు చోరీలు

- మాచినేనిపేటతండా, పీఎన్‌పురం గ్రామాలలో సంఘటనలు
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు
- వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీం



విచారణ నిర్వహిస్తున్న సీఐ శ్రీలక్ష్మి

జూలూరుపాడు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఒకే రోజు రెండు చోరీలు చోటుచేసుకున్న సంఘటన మంగళవారం అర్ధరాత్రి పడమటనర్సాపురం, మాచినేనిపేటతండా గ్రామాలలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే మండలంలోని బేతాళపాడు పంచాయతీ పరిధిలోని పంతులతండా గ్రామానికి చెందిన గుగులోత్ బాలాజీ పడమటనర్సాపురం గ్రామంలో డ్రిప్ పైపుల షాపును నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు అతని షాపునకు వేసిన తాళాలను పగలగొట్టి లోపలకు చొరబడ్డారు. షాపులో ఉన్న రూ. 35వేల నగదుతో పాటు రూ. 20వేలు విలువచేసే పైపులు(బ్లాకలేటర్లను) ఎత్తుకుని వెళ్లారు. అతను బుధవారం ఉదయం షాపు తీసేందుకు రాగా తాళాలు పగలగొట్టి కనిపించాయి. షెటర్ తీసి లోపలికి వెళ్లి చూడగా సామగ్రి చిందరబందరగా పడవేసి ఉన్నాయి. కౌంటర్‌లో ఉంచిన రూ. 35వేల నగదు, సామగ్రి చోరీకి గురైనట్లు వ్యాపారి గుర్తించాడు.

అదే విధంగా మండలంలోని మాచినేనిపేట తండా గ్రామంలో బీరెల్లి సుధాకర్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కొత్తగూడెంలో ఇంటి నిర్మాణాన్ని చేపడుతుండటంతో సుధాకర్, అతని భార్య కలసి మంగళవారం ఉదయం అక్కడకి వెళ్లి రాత్రి కొత్తగూడెంలోనే ఉన్నారు. ఉదయం వచ్చి చూడగా తలుపు తాళాలు పగలగొట్టి కనిపించాయి. లోపలకి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరబందరగా పడవేసి ఉన్నాయి. బీరువాలోని 5తులాల విలువ చేసే రెండు జతల చెవుల బుట్టలు, 20తులాల వెండి పట్టీలు, 20తులాల వెండి వస్తువులతో పాటు, రూ.30వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితులిద్దరు చోరీ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటన స్థలాలను జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మీ, ఎస్‌ఐ బాదావత్ రవి సందర్శించి వివరాలను అడిగి తెలుసుకుని విచారణ నిర్వహించారు. చోరీల ప్రదేశాలను పరిశీలించారు. సంఘటన స్థలాలను క్లూస్ టీం సందర్శించి వేలిముద్రలను సేకరించారు. వారి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తహసీల్దార్‌ను దూషించిన కేసులో యువకుడి అరెస్ట్

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న తహసీల్దారును దూషించిన కేసులో యువకుడిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ యయాతిరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేటకు చెందిన సీహెచ్.గోపాలకృష్ణ అనే యువకుడు ఈనెల 11న ఓ భూ వివాదాన్ని పరిష్కరించాలని తహసీల్దారు రామకృష్ణను కలిసి కోరాడు. సంబంధిత భూమికి సంబంధించిన భూ రికార్డులను పరిశీలించిన తరువాత పరిష్కరిస్తానని తహసీల్దారు తెలిపారు. దీంతో ఆగ్రహించిన గోపాలకృష్ణ విధుల్లో ఉన్న తహసీల్దారుతో వాగ్వాద పడి విధులకు ఆటంకం కలిగించాడు. అంతే కాకుండా అదేరోజు రాత్రి ఫోన్‌చేసి అసభ్యపదజాలంతో దూషించాడు. దీంతో తహసీల్దారు ఈనెల 12న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈకేసులో నిందితుడుగా ఉన్న గోపాలకృష్ణను బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ వివరించారు.

మట్టి అక్రమ తవ్వకాలపై పోలీసుల దాడులు

● బోనకల్‌లో నాలుగు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లు, వేంసూరులో రెండు ఇసుక లారీల పట్టివేత

బోనకల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో అక్రమ మట్టి తోలకాల స్థావరాలపై బుధవారం మధిర సీఐ మధు, ఎస్‌ఐ పొదిలి వెంకన్న, గిర్దావర్ షేక్ వహిదా సుల్తానాలు దాడులు నిర్వహించారు. కొంతకాలంగా లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో అనుమతులు లేకుండా కొందరు అక్రమ మార్గంలో వందల ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. ఎట్టకేలకు పోలీసు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు చేయడంతో అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. వీటిని జిల్లా మైనింగ్ అధికారులకు అప్పగిస్తున్నట్లు సీఐ, ఎస్‌ఐలు తెలిపారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

వేంసూరు: ఆంధ్రా నుంచి సత్తుపల్లి ప్రాంతానికి ఇసుక రవాణా చేస్తున్న ఒక టిప్పర్, లారీలను వేంసూరు మండలం వెంకటాపురం వద్ద పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించగా ఒక టిప్పర్, లారీని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసులో ఆరు నెలల జైలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం వేధింపు కేసులో నిందితునికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ బుధవారం తీర్పు వెల్లడించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. జూలూరుపాడు మండలానికి చెందిన మాలోత్ అరుణకు చుంచుపల్లి మండలానికి చెందిన మాలోత్ జానకీరామ్‌తో 2012 తో వివాహం జరిగింది. వివాహ సమయంలో ఖర్చులకు ఖర్చులకు రూ.4 లక్షలు, ఆరు తులాల బంగారం, ఒక ద్విచక్రవాహనం, గృహ ఉపకరణాల కోసం రూ.50 వేలు తన భర్త మాలోతు జానకీరామ్‌కు తీసుకున్నాడు. ఒక సంవత్సరం బాగానే ఉన్నారు. అనంతరం జానకీరామ్ అరుణపై వేదింపులకు దిగాడు. అదనపు కట్నం కావాలని వేదించేవాడు. భర్తకు తోడు అత్త సోనా కూడ కోడల్ని వేదించసాగింది అత్తకు మద్దతుగా ఆడబిడ్డ భూక్యా విజయ, ఆమె కుమారులు మోహన్, యోగేష్ అదనపు కట్నం తేవాలని వేధించే వారు. అందరూ కలిసి తనను ఇంటి నుండి పది నెలల క్రితం వెల్లగొట్టారని న్యాయం చేయాలని 2016 నవంబరు 26న అప్పటి జూలూరుపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ ఈ.రాజేష్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో ఐదుగురిపై చార్జ్ షీట్ దాఖలు చేశారు. మాలోత్ జానకీ రాముపై నేరము రుజువు అయినందున ఆరు నెలల జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధించారు. మిగత వారిపై నేరం రుజువు కానందున కేసును కొట్టి వేశారు.



నోటరీల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఖమ్మం లీగల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నోటరీ పబ్లిక్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా రిజిస్ట్రార్ ఎం.రవీంద్రరావుకు నోటరీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా జీరాక్స్ సెంటర్ల వద్ద నోటరీ చేయబడును అనే బోర్డు పెట్టి నోటరీలు చేస్తుండడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీరాక్స్ సెంటర్లు, టైపిస్టుల నోటరీ దందా, నకిలీ నోటరీల గుర్తింపు వంటి వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. నోటరీ పబ్లిక్ సంఘం అధ్యక్షుడు పారుపల్లి అమర్చంద్, ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ చౌదరి, కోశాధికారి మందా రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలే బలమైన పునాది

ఖమ్మం రూరల్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి సంపూర్ణ ఆరోగ్యానికి అంగన్‌వాడీ కేంద్రాలు బలమైన పునాదులుగా నిలుస్తున్నాయని సీడీపీవో సీహెచ్ కమలప్రియ అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

విధులకి అనుమతించాలని వినతి

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో దడవాయిగా పని చేస్తున్న తనను తిరిగి డ్యూటీకి అనుమతించాలని దడవాయి సంఘం మాజీ అధ్యక్షుడు మోటె కుమార్ బుధవారం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావుకు వినతి పత్రం అందించారు. దడవాయి సంఘ కార్యాలయం మరమ్మతులకు, ఉద్యోగుల క్రీడల్లో గాయపడ్డ తోటి దడవాయికి సంఘం తరుపున సుమారు రూ. 25 వేలు ఖర్చు పెట్టానని, సదరు నగదును నాటి మార్కెట్ కార్యదర్శి ఇవ్వకుండా బదిలీ అయ్యాడని, ఆ నగదును తననే చెల్లించాలంటూ వత్తిడి చేస్తున్నారని లేకపోతే విధులకు రావద్దంటూ దడవాయి సంఘ సభ్యులు అడ్డుకుంటున్నారని వాపోయాడు. ఈ విషయంపై విచారణ చేసి తనను తిరిగి డ్యూటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, డైరెక్టర్ బోజెడ్ల సత్యనారాయణ పలువురు దడవాయిలు ఉన్నారు.

ప్రాణదాతలుగా నిలవండి

ఖమ్మంబైపాస్‌రోడ్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజు వేడుకల సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం బుధవారం నగరంలోని టీఎన్‌జీవో ఫంక్షన్‌హాల్ నందు నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్రనాయకులు, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరావు, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు పాల్గొని ప్రసంగించారు. రక్తదానం చేసిన వారంతా ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. ప్రధాని మోదీ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకని భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు దేశవ్యాప్తంగా జరుగుతున్న సేవా సంకల్ప్ వాక్‌లో భాగంగానే ఈశిబిరం ఏర్పాటుచేశామన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు గంటేల విద్యాసాగర్,మందడపు సుబ్బారావు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు, నకిరికంటి వీరభద్రం, శీలం పాపారావు, గుత్తా వెంకటేశ్వర్లు, జ్వాలా నరసింహారావు, పమ్మి అనిత , అల్లిక అంజయ్య, మంద సరస్వతి, వీరవల్లి రాజేష్, ధనియాకుల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యకర్త రాజమ్మ మృతి


రాజమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని

నేలకొండపల్లి, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లికి చెందిన సీపీఎం సీనియర్ మహిళా కార్యకర్త గోళ్ల రాజమ్మ(68)అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మృతురాలు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మృతురాలికి భర్త కృష్ణమూర్తి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజమ్మ మృతి సమాచారం తెలుసుకున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం రాజమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజమ్మ మృతి పార్టీకి తీరని లోటన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు బొడ్డు బొందయ్య, గెల్లా జగన్మోహన్‌రావు, గూడవల్లి రాంబ్రహ్మం, దగ్గుల రామాంజనేయరెడ్డి, వెన్నపూసల సీతారాములు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అక్రమ కేసులను ఎత్తివేయాలని వినతి


ఉప ముఖ్యమంత్రి భట్టికి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో ఉన్న జర్నలిస్టులపై పోలీసులు కేసులు పెడుతున్నారని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్),టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం అందించారు. ఖమ్మంలోని ఓ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ సాంబశివరావు, మరో ఇద్దరు రిపోర్టర్లపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని వినతిలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ తమ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమంకోసం పనిచేస్తుందన్నారు. జర్నలిస్టులపై నమోదు చేయబడిన కేసులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి న్యాయ చేస్తానన్నారు. జర్నలిస్టుల పక్షాన ప్రభుత్వం ఉంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రారవి, ఐజేయూ జిల్లా మాజీ అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మామిడాల భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విమోచనకాదు.. విద్రోహదినమే

తిరుమలాయపాలెం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచనకాదని ముమ్మాటికి విద్రోహదినమని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు రేపాకుల శివలింగం తెలిపారు బుధవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాటల్లాడుతూ తెలంగణ పోరాటంలో ఏమాత్రం సంబంధం లేని మతోన్మాద శక్తులు చేసే విష్రప్రచారాన్ని తెలంగాణ సమాజం తిప్పికొట్టాలన్నారు. ఈకార్యక్రమంలో కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మడి హనమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, మీగడ సత్యం, గొడుగు విజయ్, పి.వెంకటస్వామి, రాయిండ్ల చిరంజీవి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు..

డిప్యూటేషన్‌పై ఇద్దరు ఏఈవోల బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామేపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'ఏఈవోల దురుసు' అనే శీర్షికతో సెప్టెంబరు 12న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురణ అయిన కథనంపై అధికారులు స్పందించారు. సంఘటనను అధికారులు విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. విచారణలో భాగంగా కామేపల్లి ఏఈవోగా పని చేస్తున్న శ్రీకన్యను నేలకొండపల్లి మండలం నాచేపల్లి క్లస్టర్‌కు, మద్దులపల్లి పనిచేస్తున్న ఏఈవో రవిని ముదిగొండ మండలం ముత్తారం క్లస్టర్‌కు డిప్యూటేషన్ బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం


కేఎంసీ కార్యాలయంలో...

ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రజా పాలనలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని, ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలు, ఉత్తర్వులను ఉద్యోగులు పకడ్బందీగా అమలు చేయాలని అధికారులతో అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు కోరిన ప్రజాపాలన జరుగుతుందని, ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల కోసమే అమలు జరుగుతున్నాయని పలువురు నాయకులు అన్నారు.


కలెక్టరేట్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్


మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో...


నేలకొండపల్లిలో...


ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో...


సీపీ కార్యాలయంలో...


కామేపల్లిలో....


తిరుమలాయపాలెంలో...


బీఆర్ఎస్ కార్యాలయంలో...

అంకితభావంతో పనిచేయాలి

» డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యం పట్ల ఆస్పత్రులు అంకితభావంతో పనిచేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునిల్‌దత్, వైద్యాధికారులతో కలిసి వైద్యఆరోగ్యశాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు మంచి సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎన్ని అవాంతరాలొచ్చినా ప్రజలకు ఇబ్బందులు పడోద్దని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రుల పరిధిలోకి చేర్చుకుని కోఆర్డినేటర్ల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పా రు. కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయించిందన్నారు. పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న సంస్థ లు, ఆస్పత్రుల ఆధునిక సౌకర్యాలతో పాటు క్లీనికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట ప్రకారం నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ప్రతి ప్రైవేటు ఆస్పత్రి పొల్యూషన్ బోర్డు సర్టిఫికెట్, బయోమెడిక ల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో నాణ్యతలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతి బాయి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందూనాయక్, ఆరోగ్యశ్రీ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ

కామేపల్లి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతలింగాలలో గల కేజీబీవి పాఠశాలను తహశీల్దార్ సీహెచ్. సుధాకర్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. సౌకర్యాలపై ఆరా తీశారు. రికార్డులను భోజనశాలను, భోజనాన్ని పరిశీలించారు. వారితో అక్కడే కూర్చుని భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి


విశ్వకర్మ జయంతిలో పాల్గొన్న యూనియన్ నాయకులు

ఖమ్మం సాంస్కృతికం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యో తి): రకరకాల వృత్తులకు ఆద్యుడు విశ్వకర్మ అని ఖమ్మం నగర కార్పెంటర్ మేస్త్రీలు, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దోనోజు పాపాచారి అన్నారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ఖమ్మం కాల్వొడ్డులోని బ్రహ్మంగారి గుడి వద్ద ఖమ్మం నగర కార్పెంటర్ మేస్త్రీలు, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దిగజర్ల వెంకన్న, భైరోజు యాదగిరి, దోనోజు వెంకన్న, పొడకంటి శ్రీను, దామోదరాచారి, ధనుంజయ, మహేష్, బ్రహ్మం, సైదాచారి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



ఖమ్మం లీగల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నాయసేవాధికార సంస్థ, ఖమ్మం న్యాయ సేవా సంస్థలో రక్తదాన శిబిరాన్ని సంకల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఖమ్మం అధ్వర్యంలో ఏర్పాటు చేశారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి. చంద్రశేఖర్‌రావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు 15 రోజులకు ఒక్కసారి రక్తాన్ని ఎక్కించాలని నిర్వహకులు తెలిపారు. సేవా సంస్థ నిర్వహకురాలు అనిత, డాక్టర్ నారాయణమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాండపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజును చేయటమే లక్ష్యం

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): రైతును రాజును చేయటమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తున్నదని పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నేలకొండపల్లిలో రూ.6.50కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించిన అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా, సంక్షేమం, అభివృద్ధిరెండు కళ్లుగా అమలు చేస్తున్నామన్నారు. అంతే కాదు అర్హత ఉన్న ప్రతి పేద వానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం. ఇందిరమ్మ ఇళ్ళకు డబ్బులివ్వరని చేసిన ప్రచారాన్ని తిప్పి కొడుతూ ప్రతి వారం నిర్మాణాన్ని బట్టి బిల్లులు ఇస్తున్నాం. ఏది ఏమైనా ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసి చూపిస్తామన్నారు. స్థానిక నాయకులు కోరిక మేరకు సెంట్రల్ లైటింగ్‌ను డిగ్రీ కళాశాల వరకు త్వరలోనే వేసే ఏర్పాటు చేస్తానని ప్రజల కరతాళ ధ్వనుల మధ్య మంత్రి పొంగులేటి ప్రకటించారు. కార్యక్రమంలో కొడాలి గోవిందరావు, వెన్నపూసల సీతారాములు, బొల్లినేని వెంకన్న, నంబూరి రామారావు, బొడ్డు బొందయ్య, గుడిమళ్ళ మధు, బచ్చలకూరి నాగరాజు, కట్టెకోల నాగార్జున, కొర్లకుంట నాగేశ్వరరావు, షేక్.ఖాజా మియా, కట్టా రాజేష్ తదితరులున్నారు.

ఒకటో డివిజన్ రైల్వే కాలనీలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గం పరిధిలో ఉన్న ఖమ్మం కార్పొరేషన్ ఒకటవ డివిజన్ ఖైకొండాయిగూడెంలో బుధవారం రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రూ. 1.34 కోట్ల అంచనా వ్యయంతో రైల్వే కాలనీలో, రూ.1.76 కోట్ల అంచనా వ్యయంతో కేఆర్ఆర్ ఫంక్షన్ హాల్ దారిలో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.3.10కోట్లతో చేపట్టనున్న ఈ రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మంత్రి పొంగులేటి సంబంధింత కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రతి కాలనీ, ప్రతి వీధి లో మౌలిక వసతులు సమకూర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్ల పనులను వేగంగా పూర్తిచేస్తామన్నారు.

వ్యాపార అడ్డాగా కేఎంసీ

» పని గంటల సమయంలో ప్రైవేట్ వ్యాపారుల ప్రచారం
» ఉద్యోగుల కూర్చీల వద్దకు వెళ్లి కరపత్రాలు, బ్రోచర్ల పంపిణీ




కేఎంసీ కార్యాలయం వద్ద బిర్యాని కూపన్ల అమ్మకాలు చేస్తున్న ఓ రెస్టారెంట్ మేనేజరు

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో 5లక్షల మంది ప్రజలకు సేవలు అందించేందుకు నిర్మాణం చేసిన ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం ఇప్పుడు ప్రైవేట్ వ్యాపారాల మార్కెటింగ్‌కు అడ్డాగా మారిపోయింది. కేఎంసీ కార్యాలయంలోకి ఎవ్వరు వస్తున్నారు, ఎవ్వరు పోతున్నారో తెలియని పరిస్థితి. అడిగే వారు లేకపోవడంతో ప్రయివేట్ వ్యాపారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఉద్యోగుల పని గంటల సమయంలోనూ చాంబర్‌లోకి వెళ్లి కరపత్రాలు, బ్రోచర్లను పంపిణీ చేసి మోటివేషన్ చేస్తున్నారు.

బిర్యానీ నుంచి కార్ల అమ్మకాల వరకు

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో వెయ్యికి పైగా అన్ని విభాగాల ఉద్యోగులు ఉంటారు. ఒకే కార్యాలయంలో వందల సంఖ్యలో ఉద్యోగులతో పాటు గా రవాణా ఖర్చులు లేకపోవడంతో ఖమ్మం నగరంలోని బిర్యానీ సెంటర్లు నుంచి కార్లు షోరూంల వరకు కేఎంసీ కార్యాలయాన్ని తమ ప్రచారానికి వాడుకుంటున్నాయి. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అనేక వ్యాపార సంస్థలు కేఎంసీ కార్యాలయంలో ఉద్యోగుల చాంబర్లు, కూర్చీల వద్దకు వెళ్లి తమ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని మోటివేషన్ చేస్తున్నారు. ఒకటికి రెండు మూడు సార్లు తిరిగి వారి ఉత్పత్తులను అమ్మకాలు చేస్తున్నారు. దీంతో ఉద్యోగులు సమయం వృథా జరుగుతుందని ఆరోపణలు వ్యాపిస్తున్నాయి.

ప్రత్యేకంగా ఉద్యోగి కేటాయింపు

కేఎంసీ కార్యాలయానికి నిత్యం వచ్చే ఫిర్యాదుదారులు, ప్రజలకు సరైన సమాదానం చెప్పేందుకు, ఏ పని కోసం వస్తే వారిని ఆ విభాగానికి తీసుకెళ్లేందుకు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధులకు ఆటంకం కలగకుండా అవసరమైన వారినే కేఎంసీ కార్యాలయం లోపల విభాగాలకు పంపేందుకు కేఎంసీ కార్యాలయంలో ప్రత్యేక ఉద్యోగిని కేటాయించారు. కేఎంసీలోని ఆవుట్ సోర్సింగ్ ఉద్యోగుల్లోనే అతనికి అత్యధిక వేతనాలను చెల్లిస్తున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. అయితే అనాధికారికంగా కేఎంసీలోకి వచ్చే వారిని అడ్డుకోవాల్సిన సదరు ఉద్యోగి చేయాల్సిన పనులు చేయకుండా, ఇతర పైరవీ పనులు చేస్తుండటంతో కేఎంసీలోకి ఎవ్వరు పడితే వారు వస్తున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. ఇక కేఎంసీ కార్యాలయంలో ఉద్యోగుల పర్యవేక్షణకు ఒక మెనేజరును ప్రభుత్వం కేటాయించినా, అతను హాజరుకే పరిమితమవుతున్నారని ఆరోపణలు వ్యాపిస్తున్నాయి. కేఎంసీ కమిషనర్ స్పందించి ప్రైవేట్ వ్యాపారుల ప్రచారాన్ని అడ్డుకొని, ప్రభుత్వ ఉద్యోగుల పని గంటల సమయం వృథా కాకుండా చూడాలని కార్పొరేటర్లు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై కేఎంసీ మేనేజరు బుచ్చిబాబును వివరణ కోరగా ప్రైవేట్ వ్యాపారుల ప్రచారం తన దృష్టికి వచ్చిందని, ఇప్పటికే కొంతమందిని హెచ్చరించామని, భవిష్యత్‌లో కంట్రోల్ చేస్తామన్నారు.

మంత్రి పొంగులేటి నేటి పర్యటన ఇలా..

తిరుమలాయపాలెం, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం మండలంలో పర్యటించనున్నట్టు మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి దయాకరరెడ్డి తెలిపారు. మండలంలోని కుక్కలతండాలో బీటీరోడ్లుకు శంకుస్థాపన చేస్తారు. మేడిదపల్లిలో అంగన్‌వాడీ భవనానికి, సీసీ రోడ్లకు, తిమ్మక్కపేటలో ఆర్అండ్‌బీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ ఇంజనీరింగ్ కార్యవర్గం ఎన్నిక



ఎస్ఈ శ్రీనివాసాచారికి పూలమొక్కను అందిస్తున్న కమిటీ సభ్యులు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): టీజీఎస్పీడీసీఎల్ తెలంగాణ రాష్ట్ర అసిస్టెంట్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా విక్రమ్ ఎన్నికైనారు. ఈ మేరకు బుధవారం ఖమ్మంలోని విద్యుత్‌శాఖ భవనంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారిని కమిటీ సభ్యులు కలిసి పూలమొక్కను అందించారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామకృష్ణ, వంశీ సభ్యులు పాల్గొన్నారు.



రెండు పీఏసీఎస్‌ల పాలక వర్గాల రద్దు

మరో రెండు పాలక వర్గాల పదవీకాలం పొడిగింపు ● సందిగ్ధంలో చెన్నూరు కమిటీ

కల్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకారం బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో కల్లూరు, పోచారం ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గ కమిటీలను రద్దుచేస్తూ జిల్లా జాయింట్ కోఆపరేటివ్ రిజిస్ట్రార్ నుంచి బుధవారం ఆదేశాలు అందాయి. మరో రెండు సహకార సంఘాలైన చిన్నకోరుకొండి, కొర్లగూడెం పాలకవర్గాల కమిటీల పదవీకాలం గడువు యథావిధిగా కొనసాగిస్తూ కేంద్ర సహకార బ్యాంకు జాయింట్ రిజిస్ట్రార్ ఆదేశాలు అందించారు. ఇక మండలంలోని చెన్నూరు పీఏసీఎస్ పాలకవర్గ పదవీకాలం పొడిగింపుపై ఆ శాఖ తరుపున రద్దుచేసే విషయంలో అధికారుల నిర్ణయం మేరకు సందిగ్ధంలో ఉంచారని సమాచారం.

ఏఎంసీ చైర్మన్ నీరజాదేవికి సన్మానం



కల్లూరులో ఏఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలిగా కల్లూరు ఏఎంసీ చైర్మన్ ఎంపిక కావటం పట్ల కల్లూరులో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా శాలువాలతో సత్కరించారు. వ్యవసాయం రంగంతో పాటుగా మార్కెట్ కమిటీని అన్ని విధాలుగా అభివృద్ధిలో ముందుకు తీసుకువెళ్లటమే కాక, రైతులు అనేక రకాలుగా సేవలందించి మంచి గుర్తింపు పొందారు. దీంతో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సహకరంతో నీరజాదేవి ఉమ్మడి ఖమ్మం జిల్లా మార్కెట్ కమిటీల ఫోరం ఉపాధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కల్లూరు ఏఎంసీలో కాంగ్రెస్ నాయకులతో పాటుగా, పాలకవర్గ సభ్యులు, ఏఎంసీ కార్యదర్శి జి.సత్యనారాయణ, సిబ్బంది కూడా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్కినేని కృష్ణ, పెద్దబోయిన శ్రీను, ఎస్‌కే తురాబుఅలీ, బైర్ల కాంతరావు, నోటి కృష్ణరెడ్డి పాల్గొన్నారు.

కల్లూరులో స్వచ్ఛతా హీ సేవ ప్రారంభం

కల్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని మునిసిపాలిటీలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీ కార్మికులు, అధికారులు ప్రజాప్రతినిధులు ప్రదర్శన చేశారు. అంబేద్కర్ సెంటర్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలిగేలా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపాలిటీ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతానవేణు గోపాలస్వామి ఆలయ చైర్మన్ దారా రంగ, మునిసిపాలిటీ కార్మికులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు బాగం ప్రభాకర చౌదరి, పెద్దబోయన శ్రీను, ఆళ్ల నరిసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మున్నేరును సందర్శించిన మైనింగ్ అధికారులు

చింతకాని, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నమండవ గ్రామంలోని మున్నేటిని బుధవారం మైనింగ్ అధికారులు సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తోలుకునే ఇసుక ట్రాక్టర్ల నుండి అక్రమంగా వసూళ్ల దందా నిర్వహిస్తున్నారని, ట్రాక్టరుకు రూ వేయి నుండి 2 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన నేపథ్యంలో మైనింగ్ అధికారులు మున్నేటిలో ఇసుక రవాణా తీరు, తవ్వకాలను పరిశీలించారు. త్వరలో మున్నేటిని మరో సారి సందర్శించిన అనంతరం నివేదికను రూపొందించి ఉన్నతాధికారులు అందజేస్తామని మైనింగ్ ఆర్ఐ నాగరాజు తెలిపారు.

స్వస్త్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో ప్రతీ మహిళ భాగస్వామ్యం కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ అరుణాదేవి

ముదిగొండ, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారీ... సశక్త్ పరివార్ అభియాన్‌లో ప్రతీ మహిళ భాగస్వామ్యం కావాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ అంకం అరుణాదేవి సూచించారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో స్వస్త్ నారీ... సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి వారి కుటుంబాలను బలోపేతంచేసే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. బుధవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్యనిపుణులు అందుబాటులో ఉంటారని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన వైద్యసేవలందించండి

వైరా, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆరోగ్యవంతమైన వైద్యసేవలందించాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సూచించారు. దేశవ్యాప్తంగా బుధవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు జరిగే స్వస్త నారీ... సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని వైరాలోని ఏరియా ఆస్పత్రిలో నిర్వహించారు. మహిళలందరినీ హెల్త్ స్ర్కీనింగ్ చేసి అవసరమైన చికిత్సను ప్రత్యేక వైద్యులతో అందించనున్నారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని ఏరియా ఆస్పత్రిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏరియా ఆస్పత్రిలోని గైనకాలజీ, డాక్టర్ల గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆస్పత్రి భవనాలను పరిశీలించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ బాలు, డాక్టర్లు పి.వెంకటేశ్వర్లు, రవి, వరుణ్, విజయ్, పీహెచ్‌సీ డాక్టర్ బత్తినేని శ్రీహర్ష, కాంగ్రెస్ నాయకులు బొళ్ల గంగారావు, పమ్మి అశోక్, పోదిల హరినాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

సత్తుపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే రోగులకు మెరుగైన వైద్యం అందుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన 8వ జాతీయ పోషణ మాసంలో భాగంగా ప్రధానమంత్రి మాతృవందన పథకం పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మహిళలకు వైద్యారోగ్య సేవలు అందించడం, ఆరోగ్య సేవలు సులభంగా అందేలా చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలి నిర్వహణ, ప్రజా భాగస్వామ్యం తదితర కార్యక్రమాలను వచ్చేనెల 2వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



జయంతి మహోత్సవాల్లో భక్తులు

తల్లాడ, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జయంతి వేడుకలను తల్లాడలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోతులూరి వీరబ్రహ్మేందస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ఆస్థాన పండితులు రామడుగు నరసింహాచారి విశ్వకర్మ చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమలో మాజీ ఎంపీటీసీ రుద్రా క్ష బ్రహ్మం, విశ్వబ్రాహ్మణ మండల అధ్యక్షుడు రుద్రాక్ష నరసింహాచారి, ప్రధాన కార్యదర్శి తాటికొండ కృష్ణ, ఉపాధ్యక్షుడు ఇందోజు రవి, బ్రహ్మయ్య, సుబ్రహ్మణ్యం, బండారు భాస్కరాచారి, టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కొణిజర్ల మండలంలో....

కొణిజర్ల : మండల కేంద్రం కొణిజర్లలో బుధవారం విశ్వకర్మ జయంతిని విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేదపండితులు సత్తెనపల్లి వీరాచారి పూజాకార్యక్రమం నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు నెమలికొండ రామకృష్ణచారి జెండావిష్కరణ చేశారు. మాజీసర్పంచ్ సూరంపల్లి రామారావు విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్ నెల్లూరు రమేష్, లక్ష్మయ్యచారి, శ్రీనివాసాచారి, సైదాచారి, సత్యనారాయణచారి,వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

బోనకల్‌లో...

బోనకల్ : స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో గల జయశంకర్ విగ్రహం, బోస్‌సెంటర్లో విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం ద్వారా భవిష్యత్ మార్గాలను వెల్లడించారని సంఘనాయకులు గుర్తుచేశారు. కార్యక్రమంలో రావుట్ల సత్యనారాయణ, పంతంగి శ్రీనివాసరావు, సత్యనారాయణ, చిట్టోజు శ్రీనివాస్, రావుట్ల రామాచారి, కోటాచారి పాల్గొన్నారు.

ప్రజలంతా స్వేచ్ఛావాయువులు పీల్చుతున్నారు

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, డాక్టర్ దయానంద్



జమలాపురం కేశవరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



సాయుధ పోరాటాల వారోత్సవాన్ని నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో మన తెలంగాణను దేశంలో కలుపుకోవడంతో ప్రజలంతా స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాచరిక వ్యవస్థ నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావం కోసం అమరులైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగారం ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో..

సత్తుపల్లిరూరల్ : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని సత్తుపల్లిలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ ఎన్.పెదబాబు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. అదే విధంగా సత్తుపల్లి మునిసిపాలిటీలో కమిషనర్ కొంద్ర నర్సింహ జెండా ఎగురవేసి ఉద్యోగులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులచే ప్రతిజ్ఞ చేయించారు.

పెనుబల్లి మండలంలో....

పెనుబల్లి: పెనుబల్లి మండలంలో బుధవారం ప్రజాపాలన దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్వీనారాయణమూర్తి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అన్నపూర్ణ, సత్తుపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో సీఐ ముత్తిలింగయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రింగ్‌సెంటర్లో మండల అధ్యక్షుడు వంది వెంకటేశ్వరరావు, పలు పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సొసైటీ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు.

మహనీయులను స్మరించుకున్న ప్రముఖులు

కల్లూరు: కల్లూరులోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం ఘనంగా ప్రజాపాలన దినోత్సవంను జరుపుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్, ఏఎంసీలో చైర్మన్ బాగం నీరజదేవి, తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో పి.సాంబశివుడు, చంద్రశేఖర్, మునిసిపాలిటీలో మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, జలవనరుల శాఖ ఎస్ఈ కార్యాలయంలో వాసంతి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ డి.హరిత, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆయా అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో వీరోచితంగా పోరాడిన మహనీయులను పలువురు ప్రముఖులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు.

తల్లాడ మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో..

తల్లాడ : తెలంగణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా తల్లాడ మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్డుసెంటర్‌లో జాతీయ పతాకంను సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దమ్మాలపాటి ప్రకాశరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసఫ్, కాంగ్రెస్ నాయకులు పొట్టేటి జనార్ధన్‌రెడ్డి, రాయల రాము, కేతేపల్లి భాస్కరరావు, తుమ్మలపల్లి రమేష్, పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక మండల పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు.

మధిరలో ఘనంగా వేడుకలు ...

మధిర : ప్రజాపాలన దినోత్సవాన్ని మధిరలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాంబాబు జాతీయ జెండాఎగురవేయగా, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ సంపత్‌కుమార్, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ మధు, విద్యుత్ కార్యాలయంలో ఏడీఈ అనురాధ, టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కిషోర్, కాంగ్రెస్ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్ జెండాను ఎగురవేసారు. అలాగే బీజేపీ కార్యాలయంలో తెలంగాణ విమోచనా దినోత్సవాన్ని నిర్వహించారు. మెయిన్‌రోడ్డులోని సర్దార్ జమలాపురం కేశవరావు విగ్రహానికి పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విమోచనా దినోత్సవాన్ని నిర్వహించారు.

అమరవీరుల పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు
సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు

బోనకల్: తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు చేయాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు కోరారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో బుధవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటంలో గోవిందాపురం(ఎల్) గ్రామానికి ప్రత్యేకమైన చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు దొండ పాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, మాదినేని వీరభద్రరావు, జొన్నలగడ్డ సునీత, నరేష్, లక్ష్మణ్, లక్ష్మణరావు, బుచ్చయ్య, శ్రీనివాసరావు, చంద్రయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. మిఠాయిలు పంచి

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించి మిఠాయిలు పంచారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమాదేవి, పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ వెంకన్న, ఎంఆర్‌సీలో ఎంఈవో దామాల పుల్లయ్యలు పతాకాన్ని ఆవిష్కరించారు.

ముదిగొండలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

ముదిగొండ: ముదిగొండలో ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సునీత ఎల్జిబెత్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ హరిత, ఎంపీడీవో కార్యాలయంలో స్పెషలాఫీర్ విజయలక్ష్మీ, మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏవో సరిత, పీహెచ్‌సీలో వైద్యాధికారులు అరుణాదేవి, ధర్మేందర్, పశువైద్యశాలల్లో డాక్టర్లు అశోక్, రమేష్‌బాబు, ముదిగొండ సొసైటీ కార్యాలయంలో చైర్మన్ తుపాకుల యలగొండస్వామి జాతీయ జెండాలను ఎగురవేశారు.

సర్దార్ వల్లబాయ్‌పటేల్‌కి ఘన నివాళి

వైరా: వైరాలో బుధవారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కె వీ.శ్రీనివాసరావు, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ గురులింగం, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ పి.రామారావు, పూసలపాడు, గరికపాడు సొసైటీల్లో అధ్యక్షులు గాలి శ్రీనివాసరావు, అయిలూరి కృష్ణారెడ్డి జాతీయ జెండాలు ఎగురవేశారు. మిగిలిన ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో కూడా జాతీయ జెండాలు ఎగురవేసి సర్దార్ వల్లబాయ్‌పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు.

చరిత్రను గుర్తు చేసుకుంటూ...

కారేపల్లి: మండలంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పంచాయతీ కార్యాలయలల్లో జాతీయజెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురష్కరించుకుని చరిత్రను వివరించారు.

తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు...

ఎర్రుపాలెం: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వశాఖల అధికారులు కార్యాలయాల్లో జాతీయజెండాను ఎగురవేసి తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మన్నె ఉషాశారద, ఎస్ఐ రమేష్‌కుమార్, ఎంపీడీవో బి.సురేందర్, ఎంపీవో గంధం శ్రీలక్ష్మి, ఏవో బి.సాయి శివ, ఎంఈవో మురళీమోహన్ పాల్గొన్నారు.

తాటిపూడి-ముసలిమడుగు రోడ్డు నిర్మాణానికి
డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు..

గిరిజన గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన భట్టి విక్రమార్క



విద్యార్థినులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైరా, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి-ముసలిమడుగు ఆర్ అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి భట్టి విక్రమార్క బుధవారం రాత్రి వైరా మండలం కొత్త ముసలిమడుగులో పొలాల మధ్య ఉన్న గిరిజన బాలికల జూనియర్ కళాశాల, పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో తనిఖీకి వచ్చిన భట్టి విక్రమార్కకు గిరిజన విద్యార్థినులు రోడ్డు సౌకర్యం లేదన్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాటిపూడి-ముసలిమడుగు రూట్లో పొలాల మధ్య ఉన్న గురుకులానికి రాకపోకలు కొనసాగించేందుకు గుంతలు, బురదమయంగా ఉన్న మట్టిరోడ్డు మాత్రమే దిక్కని విద్యార్థినులు ఏకరువు పెట్టారు. మీరు గురుకులంలోనే ఉంటారు కదా... రాకపోకలు ఉండవు కదా... అని భట్టి విద్యార్థినులను ప్రశ్నించగా తాము, తమ తల్లిదండ్రులు సెలవులు ఇతర సమయాల్లో పాఠశాలకు వచ్చి వెళ్లటానికి మట్టి రోడ్డు మాత్రమే ఉందని, ఏదైనా అత్యవసర వైద్యం కోసం రాత్రివేళ వైరా వెళ్లేందుకు కూడా వాహన సౌకర్యంలేదని చెప్పారు. వెంటనే ప్రిన్సిపల్ మాధవీలతతో కలిసి విద్యార్థినులు రోడ్డు నిర్మాణం కోసం ఒక వినతిపత్రాన్ని భట్టి విక్రమార్కకు సమర్పించారు. విద్యార్థినుల విజ్ఞప్తికి స్పందించిన భట్టి వెంటనే ఈ రోడ్డు నిర్మాణానికి గానూ అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈని ఆదేశించారు. ప్రతిపాదనలు పంపించిన వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు స్పష్టం చేశారు. అధ్యాపకులు బోధిస్తున్న పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయా... మీరు బాగా చదువుతున్నారా... మౌలిక సదుపాయాలు ఎలాఉన్నాయి. డైట్ చార్ట్ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని విద్యార్థినులను డిప్యూటీ సీఎం భట్టి ప్రశ్నించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన డైట్ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజు గుడ్డు, చార్ట్ ప్రకారం చికెన్, మాంసాహార వంటలను అందిస్తున్నారని తెలిపారు. పాఠ్యాంశాలను అధ్యాపకులు, ఉపాధ్యాయులు చక్కగా బోధిస్తున్నారని, స్టడీ అవర్స్‌లో కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తిచేస్తూ చదువు చెపుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా గురుకులంలోని తరగతి గదులను, వంటశాలను పరిశీలించారు. ఈ మేరకు పాఠశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని హామీఇచ్చారు. అంతకముందు తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధిపనులను పరిశీలించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, జిల్లా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, నాయకులు మచ్చా బుజ్జీ, మల్లు రామకృష్ణ, నర్వనేని గోపాలరావు, నూతి వెంకటేశ్వర్లు, పమ్మి అశోక్ పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు ఆశా వర్కర్ల వినతి

వైరా, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా కృషిచేయాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు ఆశాకార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. బుధవారం వైరాలోని ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే సందర్శించగా.. ఆశావర్కర్లు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. ఆ తర్వాత ఓ వినతిపత్రాన్ని సమర్పించారు. అనేక ఏళ్ల నుంచి తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని, పలు దఫాలుగా ఆందోళనలు చేశామని గుర్తుచేశారు. వెంటనే ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలని కోరారు.

కమిషనరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఏన్కూరు, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతి షెడ్యూల్ విడుదల, సీఆర్టీల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 19న తలపెట్టిన ఛలో హైదరాబాదు గిరిజన సంక్షేమ కమిషనరేట్ ముట్టడి కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.ఎస్.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మూలపోచారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదోన్నతులు షెడ్యూల్, పండిట్లు, పీఈటీలు పోస్టులు అప్‌గ్రేడ్ చేయడంలో గిరిజన సంక్షేమశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామచంద్రు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూడ్ పుల్లయ్య, శంకరరావు, ఎం.నాగేశ్వరరావు, శ్యాంకుమార్, అసిబ్‌మియా శ్రీనివాస్, వివనాయక్ పాల్గొన్నారు.

వరి పంటను సందర్శించిన శాస్త్రవేత్తలు

ఏన్కూరు, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): వరిపొలాలను వైరా కేవీకే శాస్త్రవేత్తలు సందర్శించారు. బుధవారం ఏన్కూరు, జన్నారం గ్రామాల్లోని వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తెగుళ్లపై రైతులకు సలహాలు, సూచనలు అందించారు.ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పావని, ఫణిశ్రీ, ఏవో నరసింహారావు, ఏఈవోలు లహరి, నవ్య, రైతులు ఆది నరసింహారావు, స్వర్ణ కృష్ణయ్య, గుగులోత్ మనోహర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడి ఇంటికి భట్టి

చెప్పకుండా వచ్చి.. కాఫీ తాగి ఆశ్చర్యపరిచిన డిప్యూటీ సీఎం

చింతకాని, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అకస్మాత్తుగా చింతకాని మండలం నాగిలిగొండ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పగడాల రాజు ఇంటికి వచ్చి ఆ కుటుంబాన్ని, స్థానిక నాయకులను ఆశ్చర్యపరిచారు. బుధవారం ఖమ్మంలో జరిగిన ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొన్న భట్టి మధిర వెళుతూ నాగిలిగొండ గ్రామంలో ఆగి.. రాజు ఇంటికి వెళ్లి కాఫీ తాగుతూ వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. కుటుంబ పరిస్థితులు, పిల్లల చదువుల గురించి ఆరా తీసిన ఆయన ఇందిరా డెయిరీతో పాటు మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. భట్టి వెంట డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, పెంట్యాల పుల్లయ్య, కిలారు మనోహర్, బండెల నాగార్జున, సట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముత్తగూడెంలో కేంద్ర పథకాలపై అవగాహన

పెనుబల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వృద్ధులు కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రాజశేఖర్ సూచించారు. బుధవారం పెనుబల్లి మండలం ముత్తగూడెం ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కస్టమర్ సర్వీస్ పాయింట్ల సహకారంతో ప్రజలు రీకేవైసీ ప్రక్రియను బ్యాంకుకు వెళ్లకుండా ఈ సదస్సులో పూర్తి చేసుకున్నారు. సామాజిక భద్రతా పథకాలు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ బ్యాంకుఖాతాలు, బీమా పాలసీల కోసం నామినేషన్ సౌకర్యం గురించి వివరించారు. సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగయ్యగౌడ్ మాట్లాడుతూ సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయో, వాటిని ఎలా నివారించాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ముత్తగూడెం గ్రామానికి చెందిన రూ.20లక్షల పీఏఐ క్లైమ్‌ను బి.హైమావతికి అందజేశారు. పీఎంజేజేబీవై బీమా క్లైమ్ రూ.రెండులక్షలను బత్తుల సుజాతకు అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రవిప్రసాద్, వీఎంబంజర్ ఎస్ఐ కె.వెంకటేష్, పాఠశాల హెచ్‌ఎం మోహన్‌రావు, ఎస్‌బీఐ వీఎంబంజర్ బ్రాంచ్ మేనేజర్ వెంకటేష్, మేనేజర్ ఎఫ్ఐ. వసంత్, డిప్యూటీ మేనేజర్ సురేష్, గ్రామపెద్దలు, డ్వాక్రా గ్రూపుసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'టీజీఎస్'లో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



టీజీఎస్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ప్రముఖ వైద్యుడు రాధాకృష్ణమూర్తి

కల్లూరు, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని తెలంగాణ గ్రామర్ పాఠశాలలో బుధవారం ప్రముఖ వైద్యుడు పి.రాధాకృష్ణమూర్తి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు చేతుల మీదగా సైన్స్ అండ్ కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యుడు పి.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోని ఆ దిశగా అడుగులు ముందుకు వేయాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ ఎస్‌కే ఇస్మాయిల్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సౌలభ్యం కోసం మరిన్ని సదుపాయాలను కల్పించటం జరుగుతుందని తెలిపారు. పాఠశాల చైర్మన్ ఎస్‌కే జానీమియా మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధి కోసం ఈ ల్యాబ్ ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రంజిత్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ కేశవరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి కానుకగా 75 యూనిట్ల రక్తాన్ని అందించాం : నంబూరు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నంబూరు రామలింగేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదిన కానుకగా 75 యూనిట్ల రక్తాన్ని డొనేట్ చేయించినట్లు బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరు రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా సేకరించిన రక్తాన్ని ఖమ్మంలోని నోవాకేర్ బ్లడ్ సెంటర్ ద్వారా తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు అందిస్తామని తెలిపారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన యువతను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులతో పాటు కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

ప్రపంచం మెచ్చిన నేత ప్రధాని మోదీ

మధిర, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచం మెచ్చిన నేతగా ఎదిగారని బీజేపీ రాష్ట్ర నాయకులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా బుధవారం మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మధిర మెయిన్ రోడ్డులోని వినాయకగుడిలో పూజలు నిర్వహించి పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గెల్లా సత్యనారాయణ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు సుమంత్, గడ్డం శ్రీహరి నాయకులు చిలివేరు సాంబ, కుంచం కృష్ణారావు, రామిశెట్టి నాగేశ్వరరావు, సోమేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జలగం నగర్‌లో చుక్కల దుప్పి మృతి

మంత్రి కార్యక్రమం ఉన్న నేపథ్యంలో కప్పిపుచ్చే యత్నం

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చుక్కల దుప్పి ఒకటి మృతిచెందిన సంఘటన సత్తుపల్లి పట్టణంలోని జలగం నగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానిక నీలాద్రి అర్బన్ పార్క్‌కు ఆనుకుని ఉన్న జలగం నగర్‌లో దుప్పి ఒకటి మృతిచెందడంతో స్థానికులు అటవీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో స్వాధీనం చేసుకున్నారు. కాగా ఇదే విషయమై అటవీశాఖ రేంజర్ స్నేహలతను వివరణ కోరగా అర్బన్‌పార్క్‌లో దుప్పుల రక్షణ కోసం చైన్ లింక్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశామని, వెనుక వైపునున్న జేవీఆర్ ఓసీ నుంచి వచ్చి ఫెన్సింగ్‌ను ఢీకొని మృతిచెంది ఉండవచ్చునని తెలిపారు. దుప్పి మృతి వార్త సంచలనం కలిగించింది. దుప్పుల రక్షణ కోసం అర్బన్ పార్క్‌లో వేసిన ఫెన్సింగ్‌ను నేడు రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావుచే ప్రారంభించనున్నన్న సమయంలోనే దుప్పి చనిపోయిందనే వార్త సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వచ్చింది. దీనిని కప్పిపుచ్చేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వచ్చాయి.